క్లుప్తంగా

వృద్ధ కళాకారులకు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని చరితరెడ్డి డిఫెన్స్ అకాడమీలో వృద్ధ కళాకారులు కోరంపల్లి హనుమంత రావు, రావుట్ల సీతారామయ్య, గంగదాసు అంజిరెడ్డి, కంచర్ల జాన్ బాబును శనివారం సత్కరించారు. ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ జన్మదినం పురస్కరించుకొని కళాకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాతంగి సాంబశివ రావు అధ్యక్షత వహించారు. ఇటీవల స్వర్గస్తులైన ప్రగతి కళామండలి సభ్యుడు గాయని రాజ్యలక్ష్మి భర్త సిద్దు కోటేశ్వరరావుకు నివాళులర్పించారు. కళాకారులు షేక్ మస్తాన్‌వలి, పిన్నమనేని పాములయ్య, గంగారపు వెంకట్రావు, భవిరిశెట్టి శివ సుబ్బారావు, యార్లగడ్డ వెంకట్రావు, జవాంగుల శ్రీనివాస రావు, వర్ధన్‌రావు పాల్గొన్నారు. వజ్రగిరి జస్టిస్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ఏటా కళాకారులను సత్కరిస్తానని, ఇది తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాకారులు ఎం.రాంబాబు, జొన్నలగడ్డ రత్నరాజు, బీవీ లక్ష్మయ్య, పాషా, ఆదిశేషురెడ్డి, పి.ఇర్మియా, రాయిడి వెంకట్రావు, బిట్రా వేదాద్రి, జింకా సూరిబాబు, గౌతమ్ ఉన్నారు .

కంచర్ల జాన్‌బాబుకు సన్మానం

పెదకూరపాడు : నాణేలు సేకరించే కంచర్ల జాన్‌బాబు దంపతులను సత్తెనపల్లిలో ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపిక అందజేశారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

పెదకూరపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో స్కూల్ గేమ్స్‌లో అండర్-17 బాలుర, బాలికల వాలిబాల్ విభాగంలో పెదకూరపాడు జీఆర్‌సీఆర్కే శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు వేముల ప్రదీప్, నర్రా దీక్షిత జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. కబడ్డీ జట్లకు ముదిగొండ శ్రీగణేష్, జి.నవ్య ఎంపికయ్యారు. వీరిని స్కూల్ కరస్పాండెంట్ బి.కవిత అభినందించారు.

శరన్నవరాత్రుల ఉత్సవాలకు సిద్ధం

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- విద్యుత్ దీపాల వెలుగుల్లో అమ్మవారి ఆలయాలు
- వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవార్లు

సత్తెనపల్లి: చెడుపై మంచి విజయం సాధించినందుకు గుర్తుగా జరుపుకునే శరన్నవ రాత్రి వేడుకలకు ఊరూవాడ సిద్ధమయ్యాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన దసరా ఉత్సవాలను ఇప్పుడు పల్లెల్లో కూడా ఘనంగా చేపడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ ఉత్సవ కమిటీలు ఏర్పడి దుర్గాదేవికి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వ హించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లను పూర్తి చేశాయి. సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, త్రిశక్తి దుర్గాపీఠం,



సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమానికి చేరుకున్న అమ్మవారి విగ్రహం

గుంటూరు రోడ్డులోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వేంకటపతి కాలనీలో నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి పీఠంతో పాటు వడ్డవల్లి మహాలక్ష్మి చెట్టు వద్ద, వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద శరన్నవరాత్రుల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు కొలువైన విజయ దుర్గ అమ్మవారికి రోజుకో అలంకరణ గావిస్తారు. భక్తులు భక్తిశ్రద్ధలతో నవరాత్రులను నిర్వహించనున్నారు.

అమ్మవారి అవతారాలు ఇలా ..



ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాంబిక

15న రజత కవచ అలంకృత విజయదుర్గాదేవి, 16న శ్రీ బాల త్రిపుర సుందరి, 17న శ్రీ గాయత్రీ దేవి, 18న శ్రీ అన్నపూర్ణాదేవి, 19న శ్రీ మహాలక్ష్మి దేవి , 20న శ్రీ సరస్వతీ దేవి, 21న శ్రీ లలిత సుందరీ దేవి , 22న శ్రీ దుర్గాదేవి, 23న శ్రీ మహిషా సురమర్దినీ దేవి, 24న శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణ.

పెదకూరపాడు: 75 త్యాళ్లూరు గ్రామంలో వేంచేసిన అన్నపూర్ణాంబిక సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు శివసాయి సేవా సమితి ట్రస్టు సభ్యులు శనివారం తెలిపారు. 24న సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు శ్రీలలితా సహస్రనామాలతో సామూహిక కుంకుమార్చన పూజలు జరుగుతాయన్నారు.

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ శనివారం తెలిపింది. వివిధ అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

అచ్చంపేట: దసరా ఉత్సవాలలో భాగంగా అచ్చంపేటలోని వాసవీకన్యకా కన్యకా పరమేశ్వరి, శ్రీ సీతారామస్వామి, హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి,నీలకంఠేశ్వర స్వామి, చామర్రు విఘ్నేశ్వర స్వామి ఆలయాల్లో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తపాలా శాఖలో ఉద్యోగాలంటూ మోసం

అమరావతి: నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఇద్దరు యువకులు పోస్టల్ శాఖలో ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసిన ఘటన వెలుగు చూసింది. ఈ మేరకు మంగళగిరి సబ్ డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.రాధాకృష్ణమూర్తి అమరావతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ బ్రహ్మం సమాచారం మేరకు.. గతంలో పోస్టల్ శాఖలో గుంటూరు ప్రగతి నగర్‌కు చెందిన పాగళ్ళ వంశీకృష్ణ, సత్తెనపల్లి బోయి కాలనీకి చెందిన బొప్పవరపు జగదీష్ పనిచేశారు. రెండు వారాల క్రితం స్థానిక రిలయన్స్ స్మార్ట్ సమీపంలో రెండు గదులు అద్దెకు తీసుకుని కార్యాలయం ప్రారంభించారు. గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాలు ఇప్పిస్తామని గ్రామీణ ప్రాంతాలలో పదవ తరగతి పాసైన విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. సుమారు రూ.25వేల నుంచి 30వేల వరకు 30 నుంచి 40మంది దగ్గర వసూలు చేశారు. ఇటీవల ఇండియన్ పోస్ట్స్ గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో మూడవ జాబితా కూడా వెలువడిన నేపధ్యంలో డబ్బులిచ్చిన విద్యార్థుల నుంచి ఒత్తిడి పెరగటంతో నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తయారు చేసి వాటిపై ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రభుత్వ రాజముద్రలను వేసి, వివిధ గ్రామాలలోని పోస్టాఫీస్‌లో ఉద్యోగాలు వచ్చినట్లు నమ్మించారు. అలాగే కొంతమంది అభ్యర్థులను శిక్షణ ఇస్తామని అమరావతికి పిలిపించి ప్రైవేటు అతిథి గృహాలలో బస ఏర్పాటు చేసి ప్రతిరోజు తమ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు నమ్మబలికారు. ఈక్రమంలో విషయం తెలుసుకున్న మంగళగిరి సబ్‌డివిజన్ అసిస్టెంట పోస్టల్ సూపరింటిండెంట్ ఆర్.రాధాకృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బ్రహ్మం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వంశీకృష్ణ, జగదీష్‌లను అదుపులోకి తీసుకుని కార్యాలయాన్ని జప్తు చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ మాట్లాడుతూ ఇదేవిధంగా ఇంకా ఎవరైనా మోసపోయిన అభ్యర్థులు ఎవరైనా ఉంటే 94407 96217 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తమ పితృదేవతలకు పితృకార్యాలు నిర్వహించారు. మహాలయ అమావాస్య సందర్భంగా భక్తులు తమ తల్లిదండ్రులకు పిండ ప్రధానం చేసి, కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. అమరేశ్వరాలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మహాలయ అమావాస్య గురించి వివరిస్తూ మహాలయ "పక్షములలో పితృ తర్పణాలు నిర్వర్తిస్తే పితృ దేవతలంతా సంవత్సర మంతా తృప్తి చెందుతారని పురాణాలు చెబుతున్నాయన్నారు. వేకువ ఝామున 5గంటల నుంచే భక్తులు పవిత్ర కృష్ణా నదిలో స్నానమాచరించి పితృకార్యాలు నిర్వహించారు. బాల చాముండి సమేత అమరేశ్వరుని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి అమరావతికి వేలాదిగా భక్తులు వచ్చి పితృ కార్యాలు నిర్వహించారు.

సంక్షేమం, అభివృద్ధిలో చేజర్లకు ప్రత్యేక స్థానం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి రాంబాబు

నకరికల్లు: సంక్షేమం, అభివృద్ధిలో చేజర్ల గ్రామానికి ప్రత్యేక స్థానం కల్పించామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. చేజర్ల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండవ రోజు శనివారంతో ముగిసింది. ఇంటింటికి వెళ్లిన మంత్రి అంబటి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. 560 గృహాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమానికి రూ.11.15కోట్లు, అభివృద్ధికి రూ.3.59కోట్లు మొత్తం రూ.14.74 కోట్లు చేజర్ల గ్రామానికి కేటాయించినట్లు తెలిపారు. దీంతో గ్రామంలోని 1,506 కుటుంబాల్లోని 4,103 మందికి లబ్ధి చేకూరిందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ బూచిపూడి సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పల్నాడు వైద్య విభాగం కన్వీనర్ డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బి బాషా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పూల ధన్వంతరి, సర్పంచ్ బొడ్లపాటి కృష్ణకుమారి, ఎంపీటీసీలు బొడ్లపాటి వెంకటరెడ్డి, బొడ్లపాటి భాస్కర్‌రెడ్డి, పసుపులేటి సాంబశివరావు, కాసా వెంకట్రావు, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కె.నగేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో కంటి ఆపరేషన్ల నిమిత్తం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద రూ. 10 లక్షలు విలువ చేసే పరికరాలు వెంటనే ఏర్పాటు చేస్తానని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ హామీ ఇచ్చినట్లు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ తెలిపారు. శనివారం నర్సరావుపేటలో కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కలిసి విన్నవించగా ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.